అన్నీ ఉల్లంఘనలే..



కార్‌షెడ్ జంక్షన్‌లో గుడి, విద్యాసంస్థలకు అత్యంత సమీపంలో ఏర్పాటు చేసిన వైన్ షాపు

ఇష్టారాజ్యంగా మద్యం షాపుల ఏర్పాటు

- వుడా కాలనీ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా షెడ్ నిర్మాణం
- ఆలయాలకు, విద్యాసంస్థలకు సమీపంలో ఏర్పాటు
- ప్రజాందోళనలూ పట్టించుకోని వైనం
- కూటమి నాయకుల కనుసన్నల్లోనే ..
- మధురవాడ అంతటా ఇదే పరిస్థితి

మధురవాడ: జీవీఎంసీ జోన్–2 కేంద్రం మధురవాడ పరిసర ప్రాంతాల్లో వైన్ షాపుల నిర్వాహకులు కనీస నిబంధనలను పాటించడం లేదు. పార్కింగ్, ఇతర సదుపాయాలు లేకపోయినా, ఎక్కడ వడితే అక్కడ షాపులు ఏర్పాటు చేసేస్తున్నారు. కార్పొరేటర్ భర్త కనుసన్నల్లో కూటమి నాయకులే గుట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారం నడిపిస్తున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

బడికి, గుడికి సమీపంలో..

కార్‌షెడ్ జంక్షన్ ట్రాఫిక్‌తో నిత్యం రద్దీగా ఉంటుంది. అలాంటి చోట ఒక వైపు సిగ్నల్ వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీసు అవుట్ పోస్టును అనుకుని, మరోవైపు విద్యా సంస్థలు, దేవాలయాలకు అత్యంత సమీపంలోనే వైన్ షాపు ఏర్పాటు చేశారు.

నిర్మాణంలో ఉండగానే అమ్మకాలు

మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ యమహా షోరూం పక్కనే, కనీస నిబంధనలు లేకుండా ఒక వైపు భారీ షెడ్ నిర్మాణం చేస్తూ మరో వైపు మద్యం అమ్మకాలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ స్థలం కూడా రోడ్డుకు కేటాయించిందని, ప్లాన్, వీఎల్‌టీ వంటివి ఏమీ లేవని అంటున్నారు.


వుడా కాలనీ రోడ్డులో కనీస నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న బ్రాందీ షాపు షెడ్

స్థానికులు ఆందోళన చేస్తున్నా..

మధురవాడ మిథిలాపురి వికలాంగుల కాలనీలో తమ కాలనీలో వైన్ షాపు వద్దంటూ స్థానికులు శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 15 రోజులుగా క్రమం తప్పకుండా ఆందోళనలు చేస్తూ వస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదులు ఇచ్చినా అక్కడే మద్యం షాపు ఏర్పాటు చేశారు.



వికలాంగుల కాలనీలో వైన్ షాపు వద్దంటూ ఆందోళన చేసిన స్థానికులు (ఫైల్)

పార్కింగ్ సదుపాయమైనా లేకుండా..

మధురవాడ డైలీ మార్కెట్ సమీపంలో రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రముఖ దేవాలయాలు కొలువై ఉన్న సిద్ధేశ్వర పీఠం రోడ్డు రెండో వైపు ఉన్నాయి. ఇటు వైపు పీహెచ్‌సీ, ఆయుర్వేద ఆస్పత్రులకు చేరువలో వైన్ షాపు ఉంది.

- కొమ్మాది, మారికవలస జంక్షన్లలోనూ సిగ్నల్స్‌ను అనుకునే పెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే మధురవాడ, శివశక్తినగర్ రోడ్డు, కొమ్మాది, పీఎం పాలెం ఇలా అన్నింటా ఉల్లంఘనలు కోకొల్లలు.


మధురవాడ హైవే సర్వీసు రోడ్డులో వైన్ షాపు వద్ద నిలిచిపోయిన వాహనాలు

ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి



ప్రభుత్వం ఏ పనిచేసినా ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి **తీసుకోవాలి. ఉడా** కాలనీలో ఓ **పోలీస్ కానిస్టేబుల్** దివ్యాంగులను **బెదిరించడం వంటి** అక్రమ దం**దాలు చేస్తున్నాడు.** ఆ రకంగా సంపాదించిన ఇళ్లు వైన్ **షాపునకు ఇచ్చి అంద**రినీ ఇబ్బంది పెడుతున్నాడు. **అతనిపై పోలీసు ఉన్న**తాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. చాలా చోట్ల కనీస నిబంధనలు పట్టకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. వుడా కాలనీ రోడ్డు యమహా షోరూం వద్ద దుకాణం మరీ దారుణంగా ఉంది. చాలా చోట్ల ఇదే పరిస్థితి..

– మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

చాలా రోజులుగా ఆందోళనలు చేస్తున్నాం



మా వికలాంగుల కాలనీలో వైన్ షాపు వద్దని చాలాకాలంగా ఆందోళనలు చేస్తున్నాం. జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చాం. ఇక్కడ ఓ వ్యక్తి తన స్వార్థం కోసం కాలనీకి చెందిన వారందరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మా ఆందోళన, ఆవేదన గుర్తిస్తామని చెప్పారు.

– కేఎస్ ప్రసాద్, అధ్యక్షుడు, వికలాంగుల కాలనీ

చాలా దుకాణాలకు పూర్తి అనుమతుల్లేవు

మధురవాడలో చాలా వైన్ షాపులకు అనుమతులు లేవు. ప్రొవిజనల్ లైసెన్స్‌తోనే నడుస్తున్నాయి. వికలాంగుల కాలనీ షాపు వేరే చోట పెట్టుకోమని చెప్పాం. నిబంధనలు పాటించని వారికి అనుమతి ఇవ్వం. జీవో నంబర్ 210, 211కు అనుగుణంగానే పరిశీలన చేసి అనుమతులు ఇస్తాం. ఈ జీవోలను యథాతథంగా అమలు చేస్తాం.

– ఎం.సరోజాదేవి, ఎక్సైజ్ సీఐ

క్లుప్తంగా

ఐనాడ గ్రామ సభలో 30 దరఖాస్తులు


ఐనాడ గ్రామ సభలో భూమి రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్ కుమార్

పద్మనాభం: రీ సర్వేలో తప్పులను సవరించేందుకు మండలంలోని ఐనాడలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో 30 దరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ కె.ఆనంద్ కుమార్ వీటిని స్వీకరించారు. పేర్లు సరి చేయాలని 21 మంది, జాయింట్ ఫీల్డ్ సర్వే కోసం ముగ్గురు, విస్తీర్ణం సరి చేయాలని కోరుతూ ఆరుగురు దరఖాస్తు చేసుకున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న శాస్త్రి

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఈ పథకం కోఆర్డినేటర్ జె.ఎస్.శాస్త్రి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, ఏదైనా సమస్య వస్తే, తమ దృష్టికి తేవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జయప్రద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ


విశేష అలంకరణలో అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి బుధవారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ రకాల బంతి, గులాబి, చామంతి, తులసి, గజమాలలతో ఆలయ కమిటీ ప్రతినిధులు అమ్మవారిని అలంకరించారు. అమ్మవారికి బుధవారం ప్రత్యేక వారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణ భక్తులతో నిండిపోయింది. అమ్మవారికి పలువురు మొక్కులు చెల్లించుకున్నారు.

రక్తదాన శిబిరం నేడు

మధురవాడ: వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సాంస్కృతిక విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్ తెలిపారు. 7వ వార్డు గణేష్‌నగర్‌లోని ఆయన నివాసం వద్ద బుధవారం ఉదయం 10గంటల నుంచి నిర్వహిస్తామని చెప్పారు. దాతలు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఇతర ముఖ్య నాయకులు హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీబీపీ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా సర్వీస్‌రోడ్డుపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటీబీపీకి చెందిన కానిస్టేబుల్ చింతపల్లి లవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన తలకు తీవ్ర గాయం కావడంతో నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆనందపురం సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలివి.. మండలంలోని పందలపాక ఐటీబీపీలో విధులు నిర్వర్తిస్తున్న లవరాజు విధులు ముగించుకుని స్కూటీపై వేములవలసలోని తన ఇంటికి వస్తుండగా, పెందుర్తి నుంచి ఆనందపురం వైపు వస్తున్న తెల్లకారు చీకటిలో వెనుక నుంచి ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. క్షతగాత్రుని భార్య పల్లవి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.శివ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పు చేసినా.. సమర్థించినా కఠిన చర్యలు

- కలెక్టర్ హరేందిర ప్రసాద్
- భీమిలి డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు

తగరపువలస: రెవెన్యూ సిబ్బంది తమ పరిధిలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చూస్తూ ఊరుకోనని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హెచ్చరించారు. ఆనందపురం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన భీమిలి డివిజన్ రెవెన్యూ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. నివాస, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, మ్యుటేషన్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించబోనన్నారు. తమ కళ్ల ముందు రెవెన్యూ పరమైన అంశాలలో తప్పులు దొర్లితే వెంటనే స్పందించి, అద్దు చెప్పి నివేదించాలన్నారు. తప్పు చేసినా.. వాటిని సమర్థించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, డీ నోటిఫికేషన్, మ్యుటేషన్ ప్రక్రియ, రీ సర్వే, సర్టిఫికెట్ల జారీ, భూముల ఫ్రీ హోల్డ్, ప్రజాసమస్యలపై స్పందన, క్షేత్రస్థాయి రెవెన్యూ సమస్యలపై మాట్లాడారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్

నిజాయితీగా సేవలందించాలి

ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావించి నిజాయితీగా, స్నేహపూర్వక వాతావరణంలో సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సమర్థవంతంగా పని చేయాలన్నారు. అన్యాక్రాంతమైన భూములను గుర్తించి, వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేకపోతే భవిష్యత్తులో ఐటీ పరిశ్రమల నిర్వాహకులు, పారిశ్రామిక వేత్తలు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపుతారన్నారు. నిబద్ధతతో పని చేస్తేనే ఆశించిన ఫలితాలు సాధించగలమని చెప్పారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా పనిచేయాలన్నారు. తమ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే ప్రజలను పదే పదే తిప్పించుకోరాదని కలెక్టర్ సూచించారు. గ్రామస్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకు నిత్యం రెవెన్యూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కొత్తగా విధులలో చేరిన వారు విధుల నిర్వహణ, కనీస బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, ల్యాండ్ సెక్షన్ అధికారులు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, సర్వే విభాగం ఏడీ, మూడు మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.


కాన్ఫరెన్స్‌కు హాజరైన భీమిలి డివిజన్ రెవెన్యూ సిబ్బంది

తీరం అల్లకల్లోలం

రుషికొండలో నిలిచిన బోటు షికారు


ఉప్పాడ తీరం వద్ద ఉంచిన బోట్లు


రుషికొండ బీచ్‌లో అలల ఉధృతి

కొమ్మాది: దానా తుపాను నేపథ్యంలో బీచ్ రోడ్డు రుషికొండ, సాగర్‌నగర్, ఐటీ జంక్షన్, మంగమారిపేట, తిమ్మాపురం, ఉప్పాడ, భీమిలి తీర ప్రాంతా ల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈదురు గాలులతో పాటు సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగిసి పడుతున్నాయి.దీంతో సముద్రం ముందుకు చొచ్చుకుని వచ్చి తీర ప్రాంతం కోతకు గురవుతోంది.

నిలిచిన వేట: అధికారుల ఆదేశాల మేరకు మత్స్యకారులు సముద్రంలో వేట నిలిపివేశారు. పడవలను, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం సాయంత్రం తీర ప్రాంతాల్లో ఈదురు గాలులు ప్రారంభమయ్యాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండలో కూడా బోటు షికారు నిలిపివేశారు. పర్యాటకులను ఎప్పటికప్పుడు మెరైన్ పోలీసులు, లైఫ్ గార్డ్స్ అప్రమత్తం చేస్తున్నారు.

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ నూతన అవుట్‌లెట్ ప్రారంభం

తగరపువలస: ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రసిద్ధి గాంచిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ తగరపువలసలో వినియోగదారుల కోసం ప్రారంభించిన నూతన బ్రాండెడ్ అవుట్‌లెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ రీజినల్ మేనేజర్ కేవీ కృష్ణాజీ కోరారు. భీమిలి రోడ్డులో నూతన అవుట్‌లెట్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల అన్ని అవసరాలకు నూతన సాంకేతికను జోడించి ఎల్‌జీ ఓలెడ్, వాష్‌టవర్ వాషింగ్ మిషన్, క్యూనెడ్ టెక్నాలజీ టీవీ, సైడ్ బై సైడ్ రిఫ్రిజిరేటర్లతో పాటు అనేక ఉత్పత్తులు అందుబాటులో ఉంచామన్నారు. ఇండియాలో సెలబ్రేషన్లలో భాగంగా రూ.51 కోట్ల విలువైన బహుమతులతో పాటు ప్రతిరోజూ లక్కీ డ్రాలో పాల్గొని ఎల్‌జీ డ్రీమ్ హోమ్ ప్యాకేజీని గెలుపొందే సదవకాశం సంస్థ కల్పించిందని చెప్పారు.


ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ అవుట్‌లెట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు

వినియోగదారులకు ప్రతి కొనుగోలుపై స్క్రాచ్ కార్డుల ఆఫర్లు ప్రకటించామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ యుగంధర్, ఇతర ఎల్‌జీ ప్రతినిధులు, డీలర్లు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి ఢాకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న ఆలయాల పరిశీలన

తగరపువలస: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరాజు తన బృందంతో ఆనందపురం మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న దేవాలయాలను బుధవారం పరిశీలించారు. వివిధ దశలలో ఉన్న ఆలయాల గురించి దేవదాయశాఖ అధికారులకు నివేదించనున్నారు. ఆయనతో పాటు ఇంజినీరింగ్ సిబ్బంది వై.అప్పారావు, జి.నవీన్, ఎం.అజయ్, మండల నాయకుడు పినిశెట్టి సింహాచలం నాయుడు ఉన్నారు. వీరంతా ఎర్రవానిపాలెంలోని దుర్గాదేవి, గోరింటలో పరదేశమ్మ, అరిగమెరకలోని అభయాంజనేయస్వామి, సియాద్రి మెరకలోని భూలోకమాంబ, కణమాంలో రామాలయం, గొంతువానిపాలెంలో దుర్గాదేవి, నీళ్లకుండీలలో రామాలయాన్ని పరిశీలించారు. ఆయా ఆలయ అభివృద్ధి కమిటీల నుంచి వివరాలు తీసుకున్నారు.

జట్లమ్మకొండపై ఆక్రమణల తొలగింపు


షెడ్లు తొలగించడంతో సామాన్లు సర్దుకుంటున్న స్థానికులు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ సర్వే నంబర్ 276 జట్లమ్మ కొండపై ఆక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. ముందు జాగ్రత్తగా ఆక్రమణదారుల నుంచి ఎలాంటి ప్రతిఘటనలు ఎదురుకాకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తుతో అక్కడకు చేరుకున్నారు. ఇళ్లలో సామగ్రి తీయించిన తరువాత జేసీబీల సాయంతో షెడ్లు తొలగించి పట్టుకుపోయారు. గతంలో ఈ స్థలాన్ని ఆనందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి కేటాయించినట్టు తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ తెలియజేశారు.

ఈవోఆర్డీ సచివాలయ సందర్శన

పద్మనాభం: పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలని ఈవోఆర్డీ మీనా కుమారి అన్నారు. మండలంలోని కృష్ణాపురం సచివాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ వచ్చే అవకాశమున్నందున పారిశుద్ధ్యం క్షీణిస్తే అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సచివాలయ రికార్డులను ఆమె పరిశీలించారు.

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు మాయం



ఎండాడ రాజీవ్‌నగర్‌లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



అదే స్థలంలో మాయమైన హెచ్చరిక బోర్డు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డులోని ప్రభుత్వ స్థలాలు, గెడ్డవాగుల పరిరక్షణలో భాగంగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేస్తున్న హెచ్చరిక బోర్డులు మాయమవుతున్నాయి. సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో గజం స్థలం లక్షల్లో పలకడంతో ఆక్రమణదారులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఎండాడ రాజీవ్ నగర్ బస్టాప్ సమీపంలో సర్వే నెంబర్ 84 ప్రభుత్వ భూమిలో గతంలో రెవెన్యూ అధికారులు వేసిన హెచ్చరిక బోర్డు మాయమైపోయింది. లక్షల విలువ చేసే ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు స్థానిక నాయకుడు ఒకరు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ బోర్డు మాయమైనట్లు తెలుస్తుంది. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని పరిరక్షించి, బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్పస్వామి పీఠాల్లో నిత్యాన్నదానం ప్రారంభం


కృష్ణంరాజుపేట రామాలయంలో నిత్యాన్నదానాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తగరపువలస: భీమిలి మండలం శింగనబంధ పంచాయితీ కృష్ణంరాజుపేట రామాలయంలో దీక్షాపరులకు 41 రోజుల పాటు భిక్ష అందించే కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. దాతల సాయంతో డిసెంబరు 2వ తేదీ వరకు అయ్యప్ప స్వామి, భవాని, శివ, కనకమహలక్ష్మి, అప్పన్న తదితర మాలలు ధరించే వారికి మధ్యాహ్నం వేళ అన్న ప్రసాదం అందిస్తారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయ అర్చకుడు ఆకెళ్ల రవిగణేష్ అయ్యప్ప స్వామి పీఠాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు, అన్నదానం ప్రారంభించారు. బంగ్లామెట్ట దుర్గాలమ్మ ఆలయంలో స్వాములకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రారంభించారు.


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

కార్యక్రమాల్లో గాడు వెంకట నారాయణ, వెంకటప్పడు, శిరిగుడి సంతోషి ఈశ్వరరావు, నీలాపు సూర్యనారాయణరెడ్డి, శిరిగుడి చిన్న, కనకల సూరిబాబు, కాళ్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్మశాస్త సేవాపీఠంలో..

పద్మనాభం: మండల పరిధిమద్దిలోని శ్రీధర్మ శాస్త సేవా పీఠంలో బుధవారం నుంచి అయ్యప్ప స్వాములకు అన్నదానం ప్రారంభమైంది. అన్నదానాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. సేవా పీఠంలో మాలధారణలు జరిగాయి. మాలలు ధరించిన వారికి డిసెంబర్ మూడో తేదీ వరకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

డ్రంక్ అంక్ డ్రైవ్ కేసులో ఒకరికి జరిమానా

మధురవాడ: పీఎంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి ఎక్సైజ్ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రూ. 10వేలు జరిమానా విధించినట్టు పీఎం పాలెం పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని ఇటీవల అరెస్ట్ చేసి, బుధవారం కోర్టు ముందు హాజరుపరచగా ఈ జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.


కరెంటు కోతలతో ఇక్కట్లు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తీర ప్రాంతాల్లో అప్రకటిత కరెంటు కోతలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల నుండి చేపలుప్పాడ, కె.నగరపాలెం, మంగమారిపేట, రామాద్రి కాలనీ, తిమ్మాపురం ప్రాంతాల్లో గంట గంటకు కరెంటు కోత విధించడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు వస్తూ పోవడంతో ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బ తింటున్నాయని, సమాచారం లేకుండా కరెంటు కోతలు ఏమిటని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: చిట్టివలస 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌పై 11 కేవీ సంగివలస ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్-3 ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా చిల్లపేట, జీరుపేట, ఉళ్లపేట, సంగివలస, నమ్మివానిపేట, ఇడదాసరిపేట, ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి ఏరియాల్లో ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సత్యసాయి సేవాసమితి వితరణ


అన్నార్తులకు ఆహార పొట్లాలు అందజేస్తున్న సమితి సభ్యులు

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవం సందర్భంగా చిట్టివలస సత్య సాయి సేవాసంస్థల ప్రతినిధులు అన్నార్తులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఏ ఆశ్రయం లేనివారికి ఏడాది నుంచి ఇళ్ల వద్ద, ఆలయాల వద్ద రెండు పూటలకు సరిపడా ఆహారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మానాపురం సాయి కుమార్, మేకల శ్రీను, చిలుకోటి నాగరాజు పాల్గొన్నారు.

'సాయి సంహిత' సేవా కార్యక్రమాలు

తగరపువలస: సాయి సంహిత స్వచ్ఛంద సంస్థ మహిళా అధ్యక్షురాలు సంతోషి కుమారి తగరపువలస, సంగివలస పరిసర ప్రాంతాలలో అన్నార్తులకు అల్పాహారం, బిస్కట్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే తమ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు రెడ్డిపల్లి అప్పలరాజు, సభ్యులు సాయి ప్రణీత, జ్ఞాన సంహిత తదితరులు పాల్గొన్నారు.